క్లుప్తంగా

పంటల బీమా పథకం పొడిగించాలి



నరసరావుపేట రూరల్: పంటల బీమా పథకాన్ని సెప్టెంబర్ నెల చివరి వరకు పొడిగించాలని జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కామినేని రామారావు, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు కోరారు. మండల వ్యవసాయ అధికారి శాంతిని వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ పంటలు ఆన్‌లైన్ రైతు సేవా కేంద్రాల్లో కావడం లేదని, మీ సేవకి వెళ్లి రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని తెలిపారు. సక్రమంగా ఆన్‌లైన్ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే పంటల బీమా ఇన్సూరెన్స్ గడువును సెప్టెంబర్ చివరి వరకు పొడిగించాలన్నారు.

యూరియా, డీఏపీ ఎరువుల నిల్వలు పుష్కలం

సీఈవో వైవీ నారాయణ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి సొసైటి పరిధిలోని రైతులకు ఎరువుల కొరత లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టినట్లు సొసైటీ సీఈవో వైవీ నారాయణ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ఎరువులు ఎంఆర్‌పీ ధరలకు రైతులకు నిరంతరం అందుబాటలో ఉండేలా చర్యలు తీసుకున్నామని, ఈనెలలో 10 లారీల వరకు ఎరువుల అమ్మకాలు జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతానికి యూరియా 400 సంచులు, డీఏపీ 300 సంచులు నిల్వలు ఉన్నట్లు తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు.

చవితి మండపంలో కుంకుమపూజలు



నరసరావుపేట రూరల్: పొస్టల్‌కాలనీలోని సాయితిరుమల అపార్ట్‌మెంట్‌లో గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లో గణనాదుడిని ప్రతిష్ఠించి గత మూడు రోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండపంలో కుంకుమపూజను జరిపారు. మహిళలు కుంకమపూజలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



వినుకొండ : పట్టణంలోని మెప్మా కార్యాలయంలో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, మత్తు పదార్థాల వినియోగం విరమణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఎం ఉమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, డ్రగ్స్ వినియోగం చట్టరీత్య నేరమని తెలియజేశారు. కార్యక్రమంలో సీవోలు స్రవంతి, కృష్ణారెడ్డి, ఐసీటీసీ ఎల్‌టీ చిలక రోజా, ఆశ, జయ, పీఈలు జక్రయ్య, రమేష్, విజయ, రేహంత తదితరులు పాల్గొన్నారు.

శభాష్ స్వప్న తేజ



నాదెండ్ల: డీఎస్సీలో పేదింటి యువతి మెరిసింది. చిలకలూరిపేట పట్టణంలోని సాంబ శివనగర్‌లో నివాసం ఉండే చింతామంగయ్య కుమార్తె చింతా స్వప్నతేజ 1649 ర్యాంకు సాధించి ఎస్సీ కేటగిరిలో ఉద్యోగం సాధించింది. మంగయ్య దంపతులు ఇంటివద్దనే టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుని నడుపుకుంటూ ఇరువురు కుమార్తెలను చదివించారు. పెద్ద కుమార్తె రెంటచింతల ఆంధ్రా గ్రామీణ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నారు. చిన్నకుమార్తె స్వప్నతేజ డిగ్రీ పూర్తి చేసి టీటీసీ, అనంతరం 2018లో బీఈడీ పూర్తి చేసింది. నోటిఫికేషన్ వెలువడిన అనంతరరం డీఎస్సీ పరీక్ష రాసి సత్తా చాటింది. ఇరువురు కుమార్తెలు ప్రభుత్వ కొలువులు సాధించటంతో మంగయ్య కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోంది.

గొర్రెల మందలోకి దూసుకెళ్లిన కారు

నాదెండ్ల: మండలంలోని గణపవరంలోని నూతన జాతీయ రహదారి సర్వీసుమార్గంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గణపవరం గ్రామానికి చెందిన బాజీ గొర్రెల పెంపకం చేసుకుంటూ జీవిస్తుంటాడు. శుక్రవారం రాత్రి గొర్రెల మేపుకుని ఇంటికి వస్తున్న క్రమంలో నూతన జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. దీంతో రెండు గొర్రెలు మృత్యువాత పడగా, మరో రెండు గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. గొర్రెల కాపరి ఆవుల శ్రీనివాసరావు తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

బీసీ పాయింట్, వీవోఏల చేతివాటం

- డ్వాక్రా సంఘాల నగదు చెల్లింపుల్లో మతలబు
- ఘొల్లుమంటున్న బాధితులు
- పోలీసులు, అధికారులకు ఫిర్యాదు



వివరాలు వెల్లడిస్తున్న పొదుపు గ్రూపు సంఘ మహిళలు

బొల్లాపల్లి: మండలంలో బ్యాంక్‌లకు చెందిన బీసీ పాయింట్ నిర్వాహకులు, వెలుగు పథకం వీవోఏలు, చేతివాటం చూపుతున్నారని డ్వాక్రా సంఘాలు సభ్యులు వాపోతున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన బీసీ పాయింట్ నిర్వాహకులు, వెలుగు పథకం వీవోఏల వల్ల బ్యాంకులకు నగదు చెల్లింపు విషయంలో, ఇచ్చిన నగదు చెల్లించకుండా సొంత ఖర్చులకు వాడుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారని మహిళ పొదుపు గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు.

మండలంలోని పాపాయిపాలెంకు చెందిన నీలంపాటి అమ్మవారి మహిళా పొదుపు గ్రూపు నగదు రూ 1.47 లక్షల నగదును ఎస్‌బీఐకు జమ చేయమని మర్రిపాలెం బీసీ పాయింట్ నిర్వాహకులకు అందజేశారు. అయితే ఆ నగదును రుణం కింద చెల్లించకుండా తన సొంత ఖర్చులకు వాడుకొన్నారని పలువురు మహిళలు వాపోయారు. మండలంలోని రావులాపురం గ్రామానికి చెందిన వెలుగు పథకం వీవో ఏ గోపాలకృష్ణ మహిళా పొదుపు సంఘం, భవిత మహిళా పొదుపు గ్రూపులకు చెందిన నగదును బ్యాంకులకు చెల్లించకుండా చేతివాటం చూపాడని మహిళా పొదుపు గ్రూపులు లబోదిబోమంటున్నాయి. తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించాం, తిరిగి రుణం ఇవ్వమని ఆయా బ్యాంకులకు వెళితే, బ్యాంక్ అధికారులు గతంలో తీసుకున్న రుణం చెల్లించాలనడంతో విషయం ఆలస్యంగా వెలుగు చూసిందని వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం బొల్లాపల్లిలో బీసీ పాయింట్ నిర్వాహకుడు చేతివాటం చూపుతూ మోసాలకు పాల్పడుతున్నాడని స్వయంగా పొదుపు గ్రూపు మహిళలు ఆరోపించడం గమనార్హం. ఈ విషయమై వెలుగు పథకం అధికారులకు, బండ్లమోటు పోలీస్ స్టేషన్లో పాపాయిపాలెంకు చెందిన నీలంపాటి అమ్మవారి పొదుపు గ్రూపు మహిళలు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

గిడుగుకు ఘన నివాళి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు భాషాభిమానులు



గిడుగు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

నరసరావుపేట ఈస్ట్: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు తెలిపారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవైశ్య బాలమిత్ర గ్రంథాలయంలో శుక్రవారం శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు 163వ జయంతిని పురస్కరించుకొని తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, వ్యవహారిక భాష ఉద్యమాన్ని, మాతృభాష సంస్కరణ ఉద్యమాన్ని రామ్మూర్తి పంతులు నడిపారని తెలిపారు. వ్యవహారిక భాష ప్రాధాన్యతను వివరించి తెలుగు భాష అభివృద్ధికి దోహదపడ్డారని కొనియాడారు. సవర భాషకు లిపిని తయారుచేసి నిఘంటువును రూపొందించారని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో మాతృభాషపై స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.ఆర్.ప్రసాదు, అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, శ్రీవాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కోశాధికారి జూలకంటి సారథి, మేళ్లచెరువు వీరాంజనేయులు, బత్తుల మురళీ, షేక్.బాజీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురమైనది తెలుగుభాష

చిలకలూరిపేట: తెలుగుభాష మాధుర్యాన్ని లోకానికి చాటిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని పోలిరెడ్డిపాలెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జె.హైమావతి కొనియాడారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాష దినోత్సవాన్ని పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవహారిక భాషలో ఉన్న గొప్పతనాన్ని చాటిన ఘనత గిడుగు రామమూర్తికి దక్కుతుందన్నారు. చరిత్రకారుడిగా, సంఘ సంస్కర్తగా, హేతువాదిగా వ్యవహారిక భాషను గ్రంథ రచనకై కృషి చేశారని వివరించారు. అలాగే మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడ ద్వారా ఎందరో క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.శైలజ, పి.శ్రీనివాసరావు, జి.ఆదిలక్ష్మి, కె.అరుణ పాల్గొన్నారు.

ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు



నరసరావుపేట: పౌర సరఫరాలశాఖ కార్యాలయంలో ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఈనెలాఖరుతో పదవీ విరమణ చేస్తున్న మాలెపాటి సత్యనారాయణ మూర్తికి శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యాలయంలో ఆయనకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎంవీ.ప్రసాదు, ఇతర ఉద్యోగులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. డీఎస్ఓ మాట్లాడుతూ సత్యనారాయణ మూర్తి సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు అందజేస్తూనే అమ్మా ఆశ్రమం ద్వారా మానవ సేవ చేయటం చాలా గొప్ప విషయమని అన్నారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.

రంగారెడ్డిపాలెం గణపతి లడ్డూ వేలం



నరసరావుపేట రూరల్: మండలంలోని రంగారెడ్డిపాలెంలో విజయగణపతి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపంలో పూజలందుకుంటున్న గణనాధుడిని శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. 21కేజీల లడ్డూను గ్రామానికి చెందిన దారం శ్రీనివాసరెడ్డి రూ.1.25లక్షలు, 5 కేజీల లడ్డూను అమెరికాలోని విద్యార్థులు రూ.75వేలకు దక్కించుకున్నారు. అనంతరం గణనాధుడిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు. డీజేలు, డప్పులతో సాగిన ఊరేగింపులో మహిళలు, యువకులు సందడి చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొండేటి అచ్చిరెడ్డి, ఎరువు చంద్రమౌళిరెడ్డి, భీమిరెడ్డి పున్నారెడ్డి, కనిగిరి నాగిరెడ్డి, గాయం రామిరెడ్డి, బోయపాటి పుల్లారెడ్డి, యేరువ శ్రీనివాసరెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, తేళ్లూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం



నూజెండ్ల: సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దీపికా మంజూషా అన్నారు. మండల కేంద్రంలోని నూజెండ్ల ఎస్టీ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మురుగు నిల్వలు లేకుండా చూడాలని, మురుగు కాల్వల్లో, ఓవర్‌హెడ్ ట్యాంకులు బ్లీచింగ్‌తో క్లీనింగ్ చేసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. మలేరియా, డెంగ్యు, టైఫాయిడ్ వంటి సీజన్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు బాబు, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఆదిలక్ష్మి, రాధిక, విజయకుమారి, అన్నామణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలలో క్రీడా దినోత్సవం



ప్రశంస పత్రాలతో విద్యార్థులు

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ళ గ్రామం ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యానచంద్ చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకటరావు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పాల్గొని మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చందు జన్మదిన వేడుకలు పురస్కరించుకొని గత మూడు రోజుల నుంచి వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. క్రీడలు మానసిక వికాసంతో పాటు శారీరక ధృడత్వానికి దోహదపడతాయన్నారు. విద్యతో పాటు క్రీడాల్లో విద్యార్థులు రాణించటం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం విజేతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహా రావు, బ్యాంకు ఆఫ్ బరోడా ఆఫీసర్ తూము లీలా మస్తాన్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.బలరాంనాయక్, ఉపాధ్యాయులు అరవింద్, సాయి ప్రసాదు, దాసు విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరంలో తాపీ మేస్త్రీకి టోపీ

మాయమాటలు నమ్మి రూ.20 వేలు నగదు పోగొట్టుకున్న బాధితుడు

నాదెండ్ల: జిత్తులమారి చేతిలో తాపీమేస్త్రీ మోసపోయిన సంఘటన మండలంలోని గణపవరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఓ పక్క సైబర్ నేరాలు మరోపక్క మోసాలతో అమాయకులు చిత్తవుతున్నారు. గ్రామానికి చెందిన రాచపల్లి హనుమంతరావు తాపీ పనులు చేస్తుంటాడు. గృహాలు, అపార్ట్‌మెంట్లు కాంట్రాక్ట్ పద్ధతిపై నిర్మిస్తుంటాడు. రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి హనుమంతరావుకు 8500585808 నంబరు నుండి ఫోన్ చేసి తన పేరు పాలపర్తి చౌదరి అని, తనది పాలపర్రు గ్రామమని, తాను అమెరికాలో ఉంటానని పరిచయం చేసుకున్నాడు. ఇంటి నిర్మాణం విషయమై నిన్ను కలవాలన్నాడు. దీంతో గురువారం హనుమంతరావు చిలకలూరిపేటకు వెళ్ళి సదరు వ్యక్తిని కలిశాడు. సదరు వ్యక్తి చిలకలూరిపేట నుండి నరసరావుపేట వెళ్ళే రోడ్డులో ఓ స్థలాన్ని చూపి ఈ పది సెంట్లు స్థలం తనదేనని, ఐదు సెంట్లలో రూ.కోటి వ్యయంతో ఇల్లు కట్టాలని చెప్పాడు. దీంతో నమ్మిన హనుమంతరావు కాంట్రాక్ట్ విషయమై చర్చించాడు. ఇదేఅదనుగా సదరు వ్యక్తి తనకు అర్జెంటుగా రూ.20 వేలు నగదు కావాలంటూ హనుమంతరావు వద్ద తీసుకున్నాడు. సిగ్నల్ లేని కారణంగా ఫోన్ పే పనిచేయటం లేదని, ఇంటికి వెళ్ళి నీ నంబరుకు ఫోన్ పే చేస్తానంటూ నమ్మబలికి వెళ్ళిపోయాడు.

ఎంతసేపటికి ఫోన్‌పే చేయకపోవటంతో హనుమంతరావు తిరిగి ఫోన్ చేయగా స్విచాఫ్ అని వచ్చింది. దీంతో ఖంగుతిన్న బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫోన్ నెంబరు ఆధారంగా విచారించిన పోలీసులు మోసగాడిని విజయవాడకు చెందిన శనగపాటి దుర్గారావుగా గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచించారు.

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న స్కూల్ హెచ్‌ఎం కృపాదానం

చిలకలూరిపేట: మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఏఎంజీ హైస్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవమైన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఏఎంజీ హైస్కూల్‌లో గత మూడు రోజులుగా విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డి, అథ్లెటిక్స్ పోటీలను బాలురు, బాలికలకు విడివిడిగా నిర్వహించి శుక్రవారం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ పాల్గొన్నారు.

జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పేర్లు మార్పు, చేర్పులు చేపట్టిన నేపథ్యంలో పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని గుర్రం జాషువా జిల్లా సాధన సమితి కన్వీనర్ కొరివి వినయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 31న ఐఎంఏ హాలులో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు.

వినుకొండ మండలం చాట్రగడ్డపాడు గ్రామంలో జన్మించిన నవయుగ కవి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గుర్రం జాషువా పేరును పల్నాడు జిల్లాకు పెట్టడం సముచితమనీ, ఆయనకు గౌరవం దక్కుతుందని అన్నారు. కుల మత రాజకీయాలకు అతీతంగా అందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గుర్రం జాషువా మనవడు బీఆర్ సుశీల్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, గోదా రమేష్‌కుమార్, గోదా జాన్‌పాల్, బూదాల బాబురావు, కాకాని సుధాకర్, బత్తుల మురళి, విజయ్ కుమార్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- ఎస్పీ శ్రీనివాసరావు
- నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

నాదెండ్ల: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పనిచేయాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. పెండింగ్ కేసుల రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని, దొంగతనం కేసుల్లో బాధితులు కోల్పోయిన ప్రాపర్టీ రికవరీపై దృష్టి సారించాలన్నారు. నేరాల నియంత్రణకు కృషి చేయాలని, దీర్ఘకాలిక పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేసి నివేదికను అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్ నందు సీసీటీఎన్ఎస్ పనితీరు గురించి ఎస్సై పుల్లారావును అడిగి తెలుసుకున్నారు. విచారణలో ఉన్న పోక్సో కేసులు, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. అక్రమమద్యం, ఇసుక, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్‌నేరాలు, లోన్‌యాప్‌ల మోసాలు, పోక్సో కేసుల నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట రూరల్‌సీఐ సుబ్బానాయుడు ఉన్నారు.

కౌన్సిల్‌ని బహిష్కరించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు



సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చిన మున్సిపల్ వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు

వినుకొండ: స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సమావేశాన్ని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బాయ్ కాట్‌చేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సినల్ వైస్‌చైర్మన్లు బేతంగాబ్రియేలు, తెల్లాకుల రాజేష్‌ఖన్నాతోపాటు 9 మంది కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్, కమిషనరు ఏకపక్ష నిర్ణయాలతో తమకు కనీస గౌరవం లేకుండా చేశారని. ప్రధాన సెంటరులో గాం. దీవిగ్రహం ఎవరికీ తెలియకుండా తొలగించారని, ఆగస్టు 15 వతేదీన మున్సిపల్ వార్డు సచివాలయాల పరిధిలో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా టీడీపీ కౌన్సిలర్లతో జాతీయ జెండాలు ఎగురువేయించారన్నారు. మున్సిపల్ కార్యాయంలో ఎలాంటి సమాచారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు తెలియడంలేదని, తమవార్డుల్లో జరిగే పనుల వివరాలు కూడా తెలియజేయపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించారు.

సంచారజాతుల సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చిలకలూరిపేట: సంచారజాతుల బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు కోరారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచారజాతులకు చెందిన వారు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరిస్తూ కళలు, సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలుగా నిలుస్తారని చెప్పారు. అలాంటి సంచార జాతుల వారు నేడు దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, కనీసం కులధృవీకరణ పత్రాలకు కూడా పొందలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి కోసం బీజేపీ విజయవాడలోని నోవా హోటల్ పక్కన శనివారం ఉదయం 9 గంటలకు స్ఫూర్తి విముక్తి పేరున సంచార జాతుల సభ నిర్వహిస్తున్నదని, ఈ సభకు భారీగా సంచార జాతుల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎ.లక్ష్మణ్, కె.కళ్యాణదుర్గారావు, జి. బాలకృష్ణ, షేక్ సుభాని పాల్గొన్నారు.

విష్ణుకుండినగర్‌లో చోరీ



బీరువాలో నగదు దోచుకెళ్లిన దొంగలు

వినుకొండ: పట్టణంలోని విష్ణుకుండినగర్‌లో ఓ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. విష్ణుకుండినగర్‌లో నిత్యం రద్దీగా ఉండే రామాలయం వద్ద నివాసం ఉంటున్న గద్దె వెంకట్రావు వ్యక్తిగత పనులపై బజారుకెళ్లగా అతని భార్య బంధువుల ఇంటికి వెళ్లగా అదును చూసిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో నల్లపూసల గొలుసు, బంగారు చైన్, రెండు ఉంగరాలు, రూ.10వేలు నగదు దోచుకెళ్లారు. గత వారం క్రితం ఇదే రామాలయం బజారులో తెల్లవారుజామున 3గంటలకు దొంగతనానికి దొంగలు విఫలయత్నం చేసినట్లు స్థానికులు అంటున్నారు.

రామిరెడ్డిపేటలో...

నరసరావుపేట టౌన్: గృహంలో బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శుక్రవారం తెలిపారు. పోలీసుల వారు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డిపేటకు చెందిన దాసరి ప్రణీత ఈ ఏడాది జూన్ నెలలో విజయవాడలో ఉంటున్న తల్లి దగ్గరికి వెళ్తూ తన బంగారు ఆభరణాలను బెడ్ క్రింద గల కబోర్డ్‌లో భద్రపరిచింది. ఊరు నుంచి వచ్చిన తర్వాత ఆభరణాలు చూసుకోలేదు. వినాయక చవితి పండుగ సందర్భంగా ఆభరణాలు ధరించుదామని గురువారం కబోర్డు తెరిచి చూడగా అందులో ఉండాల్సిన డైమెండ్ లాకెట్ కలిగిన చైన్, బెంగాలీ గాజులు, నక్లెస్, చెవి పోగులు కనిపించలేదు. నెల రోజుల క్రితం ఇంట్లో పనిచేసే పనిమనిషి అకారణంగా మానుకుంది. పనికి రమ్మంటే సాకులు చెబుతూ రావటంలేదు. ఆమె ప్రవర్తనపై అనుమానం ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవాలి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి దశలో క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవటం ద్వారా జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తేలికగా అధిగమించి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కే-రిడ్జి పాఠశాలలో..

గుంటూరురోడ్డులోని కే-రిడ్జి పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్, వ్యవహారిక భాష ఉద్యమ నిర్మాత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.కిషోర్‌బాబు, తెలుగు ఉపాధ్యాయిని అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డెన్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

చిలకలూరిపేటటౌన్ /యడ్లపాడు: రూరల్ మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం సూపరింటెండెంట్ (వార్డెన్ల) ఇంటర్వ్యూలు జరిగాయి. నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో తాత్కాలిక ప్రతిపాదికన పనిచేయుటకు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 180 మంది హాజరయ్యారు. అయితే నవోదయ విద్యాలయ సమితి నిబంధనల ఇంటర్వ్యూలకు హాజరైన వారిలో కేవలం ఐదుగురు మాత్రమే ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలను ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ బి.చక్రపాణి, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జేఎన్‌వీ ప్రిన్సిపాల్స్ నల్లూరి నరసింహరావు, సీతామహాలక్ష్మి నేతృత్వంలో జరిగాయి.